క్లుప్తంగా

రేపు కంటి వెలుగుపై సమావేశం

కందుకూరు: మండల పరిధిలో ఈ నెల 18వ తేదీ నుంచి చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి 9న ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. అందరూ సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయం పూజారి సంతోష్ శర్మ, వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ స్వాములకు చేయూత



పడి పూజలో ఉప సర్పంచ్ రవినాయక్‌ను ఘనంగా సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని హర్షగూడలో అయ్యప్ప భక్తుల సన్నిధానంలో హర్షగూడ ఉప సర్పంచ్ జే.రవి నాయక్ అయ్యప్ప పడి పూజను నిర్వహించారు. 45 మంది అయ్యప్ప భక్తులకు రూ.1,0,5,500 వారి ఖర్చులకు శనివారం అందజేశారు. గ్రామంలో ఉన్న అయ్యప్ప భక్తులకు సన్నిధానంలో దేవుడి విగ్రహాలు, 18 పడిమెట్లను తన సొంత నిధులతో వచ్చే సంవత్సరం ఏర్పాటు చేయిస్తామని రవి నాయక్ హామీ ఇచ్చారు. ఈ నెల 8న గ్రామంలో జరిగే అయ్యప్ప ఇరుముడి పూజకు తనవంతు రూ.11 వేల సహాయం అందజేశారు. అనంతరం అయ్యప్ప గురు స్వాములు, భక్తులు రవి నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురు స్వాములు రూప్‌సింగ్, రాజు, భాస్కర్, రవి, సురేష్, సేవ్యా, పూల్యా, సోమ్లా, గోపాల్, శంకర్ నాయక్ పలువురు పాల్గొన్నారు.

ఉన్నతాశయంతో ముందుకు సాగాలి

ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా



సదస్సులో పాల్గొన్న అజయ్ మిశ్రా

దిల్‌సుఖ్‌నగర్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని, నేటితరం యువతకు ఈ స్ఫూర్తి మరింత అవసరమని ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అవినాష్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యా, వ్యాపారం, ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ ఆవిష్కరణలలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ మిశ్రా మాట్లాడుతూ... చదువుకొనే రోజుల్లోనే ఉన్నతాశయంతో ముందుకు సాగడమే కాకుండా లక్ష్య సాధనకు అహర్నిశలు శ్రమిస్తే అద్భుతాలు సాధించవచ్చని తెలిపారు. సమాజంలో విద్యాకు ఎంతో ప్రాధాన్యం ఉందని, విద్యార్థులు పట్టుదలతో ఉన్నత చదువులు చదివి తమ భవిష్యత్‌ను బంగారుమయంగా మలుచుకోవాలని సూచించారు. ఐటీ, మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్ స్ట్రీమ్‌లోకి టెక్నికల్ సెషన్లకు గీతం విశ్వవిద్యాలయం నుంచి దేవికారాణిశర్మ, ఆరోరా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శుభప్రద అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర, శివశివాణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రమణరావు, సీఈఓ ఎడ్యుకేషన్ కనెక్ట్ శివతాండు, నరేంద్రనాథ్, సుశీలకందూరి, నీతూసచ్‌దేవా, ప్రవీణ్‌కుమార్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి

రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ ప్రధాన కార్యదర్శి పిట్ల ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశానికి ఆర్‌కేపురంలో నుంచి బీజేపీ నాయకులు, కర్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు తరలివెళ్లారు.

ముగ్గుల మురిపెం

ఉత్తమ రంగవల్లులకు బహుమతులు



నందిహిల్స్ బస్టాప్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్ నందిహిల్స్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. బస్టాప్ ఆవరణలోఈ పోటీల్లో కాలనీకి చెందిన మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సాహంగా రంగు రంగుల ముగ్గులను వేశారు. ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలు ఉత్తమ రంగవల్లులను ఎంపిక చేసి ప్రథమ బహుమతి విశ్వజ, ద్వితీయ బహుమతి మీనాకుమారి, తృతీయబహుమతిని సంధ్యారాణిలకు అందజేశారు. దీంతో పాటు పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. – మీర్‌పేట

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న మంత్రి తదితరులు

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు ఓ వరంలాంటిదని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆకులమైలారం గ్రామానికి చెందిన మద్ది రామచంద్రయ్యకు రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరుతూ పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్పంచ్ కలమ్మరాజు ఆధ్వర్యంలో మంత్రి వినతిపత్రం సమర్పించారు. అదే గ్రామానికి చెందిన శివాజీకి రూ.60 వేల చెక్కును మంత్రి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధి ఏర్పాటుతో ఆదుకుంటున్నారని చెప్పారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.శేఖర్‌రెడ్డి, నాయకులు బూచిరెడ్డి రవీందర్‌రెడ్డి, దేవేందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

11న 'పీవీటీ'లో ముగ్గుల పోటీలు



మాట్లాడుతున్న పీవీటీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తదితరులు

హుడాకాంప్లెక్స్: భోగి, సంక్రాంతి సంబురాల్లో భాగంగా కొత్తపేటలోని పీవీటీ మార్కెట్‌లో ఈ నెల 11న మధ్యాహ్నం 1గంటకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పీవీటీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కై రంకొండ ధనుంజయ తెలిపారు. శనివారం పీవీటీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. శ్రీకృషి మహిళా సంఘం రేణుకారెడ్డి, జ్యోతి, శశికళ, సీత, మంజుల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 9291758351, 9848389182 నెంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవీటీ మార్కెట్ మర్చంట్స్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి కృష్ణ, కోశాధికారి భిక్షపతి, డైరెక్టర్స్ ప్రసాద్‌కుమార్, సురేశ్, రెడ్డయ్య, పోచయ్య, రాజేంద్రప్రసాద్, రాజు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

హుడాకాంప్లెక్స్: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ నాగోల్ మెట్రో అధ్యక్షుడు జి.రవిందర్ కోరారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని చాడీ సమీపంలో భారతి మహిళా మండలి అధ్యక్షులు సాజీదాబేగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని మహిళలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆహారం, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నాగోల్ మెట్రో ప్రతినిధులు మాట్లాడుతూ స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మండలి నిర్వాహకులు సాజీదాబేగంకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ట్రస్ట్ సేవలు అభినందనీయమని, కుల మతాలకు అతీతంగా సేవలందించడం సంతోషకరమని చెప్పారు. సేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తాము సంపాదించిన దాంట్లోంచి పదిశాతం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి డబ్బును వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కమ్యూనికేషన్ ఛైర్‌పర్సన్ కే.సామ్యూల్, అశోక్‌కుమార్, స్వర్ణమంజీర తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సాజిదాబేగం

అంధులకు సాయం చేయండి



ఆర్చిడ్ కాలనీలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అర్చిడ్ కాలనీలో మనోధైర్యం సంస్థ ఆధ్వర్యంలో లూఈస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పాల్గొన్నారు. అంధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. బ్రెయిలీ పుట్టుకతోనే అంధుడు కాడని, మధ్యలో అతని కళ్లు పోగా చదువుపై ఉన్న ధ్యాసతో బెయిలీ లిపిని కనుగొన్నారని తెలిపారు. అంధులను ఎగతాళి చేసే బదులు వారిని సాయం చేసి ప్రోత్సహించాలని కోరారు. అంధులను యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అంధుల కోసం రెండేళ్ల క్వింటాళ్ల బియ్యంతో పాటు రెండు కంప్యూటర్‌లు అందచేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మనోధైర్యం సంస్థ నిర్వాహకులు చందుసాయి, అంధులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్

మీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మీర్‌పేటకు చెందిన షేక్ ఫైసల్ (22) బైక్ మెకానిక్. ఫైసల్ టామ్ అలియాస్ చింటూ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి పది గ్రాముల గంజాయి ప్యాకెట్లుగా తయారు చేసి రూ.300, 500లకు మీర్‌పేట, బాలాపూర్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసు లు ఈ నెల 3న మీర్‌పేట పోలీసులతో కలిసి ప్ర శాంతిహిల్స్ దగ్గర ఫైసల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గరి నుంచి 15 గంజాయి ప్యాకెట్లు (250 గ్రాములు), సెల్‌ఫోన్, యమహా బైకును స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయిస్తున్న చింటూ పరారీలో ఉన్నాడు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

పహాడీషరీఫ్: గంజాయి కేసులో ఇద్దరిని రాచకొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించా రు. పోలీసులు తెలిపిన ప్రకారం.. షాహీన్‌నగ ర్‌కు చెందిన షేక్ జాఫర్(22) పహాడీషరీఫ్‌లో ఓ వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నాడు. ఇతని వద్ద నుంచి పోలీసులు 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. న్యూబాబానగర్‌కు చెందిన మరో నిందితుడు మహ్మద్ రషీద్‌ఖాన్(57) నుంచి 50ప్యాకెట్ల గంజాయి, రూ.1870 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇతడు ఇప్పటికే 30 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

రోడ్డుకు మరమ్మతులు

మహేశ్వరం: సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా కావడంతో మున్సిపాలిటీ నిధులతో శనివారం రోడ్డుపై మొరం పోసి మరమ్మత్తులు చేశారు. మరమ్మత్తు పనులను సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి గళ్ల రత్నం, పలువురు ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కందుకూరు: ఈనెల 13, 14వ తేదీల్లో మన్నెగూడలో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం కందుకూరు కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ కృష్ణ, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య తదితరులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ.. మహాసభల్లో విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చ జరుగుతోందని చెప్పారు. విద్యారంగ సమస్యలపై ప్రముఖ విద్యావేత్తలు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు తమ విలువైన ఉపన్యాసాలు ఇస్తారన్నారు. మంత్రి సబితారెడ్డి, కేరళ ఎమ్మెల్యే కెకె.శైలజ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన కమిటీ కన్వీనర్ ఈ.గాలయ్య, కోశాధికారి రాములయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప, ఉపాధ్యక్షుడు జగన్నాథశర్మ, కార్యదర్శి భగవంత్ రాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కల్లేశ్, డాక్టర్ జె.బుగ్గరాములు, ప్రధానోపాధ్యాయులు మురళి, మనోహరాచారి, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



దేవేందర్

హస్తినాపురం: సూర్యపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులను చూసేందుకు నగరానికి వచ్చి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... సూర్యాపేట పట్టణం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన ప్రమీల, రూబెన్ దంపతులు 20 రోజుల క్రితం బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి చింతలకుంటలో నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా రూబెన్, ప్రమీల ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారం క్రితం వారి కుమారుడు దేవేందర్(17) నగరానికి వచ్చాడు. నూతన సంవత్సరాల వేడుకల అనంతరం ఈ నెల 2వ తేదీ ఇంటికి రాకపోవడంతో కంగారు చెందిన తల్లిదండ్రులు తెలిసిన వారిదగ్గర దేవేందర్ గురించి వెతికినా ఫలితం లేదు. దీంతో తండ్రి రుబీన్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పడిపూజలో పాల్గొన్న మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో పోచమ్మ దేవస్థాన కమిటీ, రామాంజనేయ భక్త సమాజం కమిటీ అయ్యప్ప స్వాములు హనుమాన్ దేవస్థాన మందిరం ప్రాంగణంలో అయ్యప్ప పడిపూజను నిర్వహించారు. అల్మాస్‌గూడకు చెందిన పలువురు కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మేయర్ చిగురింత పారిజాత పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాలాపూర్‌లో ఇరుముడి బాలాపూర్‌లో ప్రసిద్ధ వేణుగోపాల స్వామి దేవాలయంలోని సన్నిదాన స్వాములు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పను స్మరిస్తూ ఇరుముడులు కట్టుకుని శబరిమలైకు తరలివెళ్లారు. కార్యక్రమంలో గురుస్వాములు ప్రభాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అల్మాస్‌గూడలో నిర్వహించిన అయ్యప్ప పూజలో పాల్గొన్న మేయర్ పారిజాత

బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేస్తాం



సమావేశానికి వెళ్తున్న సరూర్‌నగర్ బీజేపీ నేతలు

కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు అధిష్టానం చర్యలు చేపట్టిందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి తెలిపారు. తుక్కుగూడలో నిర్వహించిన మహేశ్వరం నియోజకవర్గం బూత్ కమిటీ సమావేశానికి శనివారం కార్యకర్తలతో కలిసి ఆమె తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం పాలక్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు సిద్దు ముదిరాజ్ జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు సురేశ్ కుమార్, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, మహిళామోర్చా అధ్యక్షులు లావణ్య, నర్సింహారెడ్డి, కిరణ్‌కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డి జయంతి వాల్ పోస్టర్ ఆవిష్కరణ



కుర్మల్‌గూడలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బడంగ్‌పేట్: ఈ నెల 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బీఎస్ రెడ్డి జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో శత జయంతి వాల్ పోస్టర్‌ను ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పురుషోత్తం మాట్లాడుతూ.. సాయుధ పోరాట స్ఫూర్తి, రాజకీయ సామాజిక అంశాలపై కామ్రేడ్ బీఎన్ రెడ్డి ప్రభావం ఎంతో ఉందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రముఖ వామపక్ష సామాజిక పార్టీల మేధావులు, రచయితలు పాల్గొని బీఎన్‌రెడ్డి సేవలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ప్రజా నాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమాలు సుమారు రెండు వేల మందితో జయంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్ రెడ్డి జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని పురుషోత్తం పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రావుల ఝాన్సీ, బీఏలఫ్ జిల్లా కన్వీనర్ బి.సుజాత, అరుణ, జగదాంబ, స్వరూప, నాగేంద్రమ్మ, విద్యార్థి సంఘం నాయకులు భానుప్రసాద్, జగన్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పర్వతాలు కూతురు యువశ్రీ జీర్ణకోశ సమస్యతో బాధ పడుతూ శాస్త్ర చికిత్స చేయించుకోగా ఆర్థిక ఇబ్బందులతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంప్రదించారు. సబితా ఇంద్రారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారు చేయగా సీఎం రీలిఫ్ ఫండ్ నుంచి రూ. 60 వేలు మంజూరైంది. ఈ చెక్కును శనివారం బాధితుల కుటుంబ సభ్యులకు నగేష్, అరవింద్ శర్మ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాజిద్, సిద్దగోని వెంకటేష్, ఊర్మిళారెడ్డి, మురళీధర్‌రెడ్డి, మహేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి

- ఎల్‌బీనగర్‌లో కాషాయ జెండా రెపరెపలాడాలి
- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

నాగోలు: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామరంగారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నాగోలు శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. బూత్ కమిటీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సామ రంగారెడ్డి మాట్లాడుతూ... బీజేపీని బలోపేతం చేయడంతోపాటు కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలనలో పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఉప ఎన్నికలు వచ్చిన ప్రాంతంలోనే ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఇతర ప్రాంతాలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ సరిగా లేదని సామ రంగారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనం ఉందని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి బీజేపీ పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో గోల్కొండ కోట మీద బీజేపీ జెండా ఎగరేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నోటిఫికేషన్లు ఇచ్చారే తప్ప ఒక్క ఉద్యోగాన్నీ భర్తీ చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్‌జీ మాట్లాడుతూ... ఢిల్లీ నుంచి గల్లీ దాకా కార్యకర్తలను అనుసంధానించడమే లక్ష్యంగా సరళ్ యాప్‌ను ఆవిష్కరించామని తెలిపారు. బూత్ కమిటీలు పూర్తి చేసి ప్రతి గల్లీలో బీజేపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ శాఖ ఇంచార్జ్ రాజశేఖర్‌రెడ్డి, బండారి భాస్కర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు కటకం నర్సింగ్‌రావు, చింతల సురేందర్ యాదవ్, కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.